సాక్షి తిరుపతి

ఆదివారం । 28 । జనవరి । 2024



రూ.10 లక్షల విరాళం

ఎస్వీబీసీ ట్రస్ట్‌కు ప్రవాస భారతీయులు శనివారం రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు. - 8లో



బైక్ ర్యాలీ

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం డీటీఓ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. - 8లో



బంగారు తిరుచ్చిపై అభయం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకన్న బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కోటలో సామాజిక సాధికార బస్సుయాత్ర



మేరిగ మురళీధర్

చిల్లకూరు: సామాజిక సాధికార బస్సుయాత్ర ఆదివారం గూడూరు నియోజకవర్గంలోని కోట పట్టణంలో నిర్వహించను న్నట్టు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సామాజిక సాధికార యాత్ర జాతీయ రహదారి పక్కనే బూదనం సమీపంలో ఉన్న-5 హోటల్ వద్ద మొదలవుతుందన్నారు. ఆ తరువాత కోటకు చేరుకుని అక్కడి నుంచి నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి పాదయాత్రగా బయలుదేరి గాంధీ బొమ్మ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు సాగుతుందని తెలిపారు. ఈ సభకు పార్టీ రాజనల్ కో-ఆర్డినేటర్ విజయ్‌సాయిరెడ్డి, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు, నెల్లూరు, సత్యవేడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనీల్ కుమార్‌యాదవ్, కోనేటి ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి, మైనారిటీ రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాషా పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వాహనం విరాళం



వాహన తాళాన్ని అందజేస్తున్న ఎండీ నిత్యానందరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.25 లక్షల విలువచేసే టెంపో ట్రావెలర్‌ను విరాళంగా అందజేసింది. ఈ మేరకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, అరబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి శనివారం ఆస్పత్రి యాజమాన్యానికి వాహనాన్ని విరాళంగా అందజేశారు.

సత్యవేడు.. ఫ్యాన్ స్పీడు!

సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ స్పీడు పెంచింది. అందరినీ ఒకే తాటిపైకి తెచ్చి ఆత్మీయ సమ్మేళనం పేరుతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించింది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నిర్ణయించింది. తద్వారా గతంకంటే అత్యధిక మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని దిశానిర్దేశం చేసింది.

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి
- చంద్రబాబు మోసపూరిత హామీలను తిప్పికొట్టండి
- కుప్పంలోనూ చంద్రబాబు ఓటమి తప్పదు
- రెండు నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతున్న చంద్రబాబు
- సత్యవేడు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ శ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి దిశానిర్దేశం



తిరుపతిలో జరిగిన సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: జిల్లాలో సత్యవేడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు తిరుపతిలో జరిగిన సత్యవేడు నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు చేస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే చంద్రబాబునాయుడు తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుయుక్తులు పన్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు రెట్టింపు పథకాలు అమలు చేస్తానంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బాబు సిద్ధమయ్యారని, వీటిని అందరూ గమనించాలని ఆయన సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబును ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఓటరు నాడిని ముందుగానే పసిగట్టిన ఆయన ఓటమిని అంగీకరించి రెండుచోట్ల పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి కొనసాగుతుందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఆదరించాలని మంత్రి పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణులు మొదటి నుంచి తనతో నడుస్తున్నారని, తాను మద్దతు తెలిపిన ప్రతి అభ్యర్థికీ మీరు అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో ఈ సారి ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్రవర్మ, సురుటుపల్లి చైర్మన్ ఏఎంసీ బాలాజీరెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), సుశీల్‌కుమార్‌రెడ్డి (సత్యవేడు), అపరంజిరాజు (నాగలాపురం), సొరకాయలు (నారాయణవనం), ఆరణి విద్యానాథరెడ్డి (బీఎన్‌కండ్రిగ), గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), వెంకటచలపతిరాజు (పిచ్చాటూరు), ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పవన్ రాజకీయాలకు పనికిరాడు

స్థిరమైన మనస్తత్వం లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే, ఆ వ్యక్తి పవన్ కళ్యాణేనని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ విమర్శించాడు. సినిమాలలో ఆయన నటనకు పనికొస్తాడే తప్ప రాజకీయాలకు పనికిరాడని తేల్చిచెప్పాడు. ఇలాంటి వ్యక్తులు ప్రజల మన్ననలు పొందడం కష్ట సాధ్యమన్నారు. ఒకసారి టీడీపీ అంటాడు.. మరోసారి బీజేపీ అంటాడు..ఇంకోసారి ఎవరితో పొత్తు ఉండదని, ఇలా పూటకో నిర్ణయం తీసుకునే వ్యక్తికి ప్రజాక్షేత్రంలో ఆదరణ ఉండదన్నారు.



సమావేశానికి హాజరైన సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణులు

పెద్దల నిర్ణయమే శిరోధార్యం

పార్టీ నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి జగనన్న, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్ణయం మేరకు సత్యవేడు సమన్వయకర్తగా నియమితులైన మద్దెల గురుమూర్తిని ఆదరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జెడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ కోరారు. తన తండ్రి కోనేటి ఆదిమూలం అనారోగ్య కారణాల రీత్యా తిరుపతిలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీకి హాజరు కాలేకపోయారని వివరించారు. పార్టీ పెద్దల నిర్ణయం మేరకు తిరుపతి పార్లమెంటు సమన్వయకర్తగా నియమితులైన కోనేటి ఆదిమూలంను అందరూ సమన్వయంతో ఆదరించాలని కోరారు.



ఎంపీ గురుమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుమన్

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

ముఖ్యమంత్రి జగనన్న ఆశీస్సులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిలైన తాను ఇకపై ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతానని ఎంపీ గురుమూర్తి పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనను అప్పట్లో ప్రకటించారని గుర్తుచేశారు. తిరుపతి పార్లమెంట్ చరిత్రలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు పరిష్కారానికి నోచుకోని సమస్యలపై పార్లమెంటులో తన వాణి వినిపించి పరిష్కారం చూపగలిగానని తెలిపారు. అదే స్ఫూర్తితో ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృది చేస్తామని చెప్పారు. రానున్న నెలరోజుల వ్యవధిలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే తన నిధుల ద్వారా నియోజకవర్గంలోని పలు రోడ్లకు రూ.1.40 కోట్లు మంజూరు చేశానని తెలిపారు. త్వరలో ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులందరూ ఒక్క తాటిపై వచ్చి జగనన్న ఆశయమైన వైనాట్ 175 ఆశయాన్ని నిజం చేయాలని ఆయన కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పేదల ముసుగులో దౌర్జన్యకాండ

- కరకంబాడిలో గుట్ట దురాక్రమణకు వామపక్షాల నేతృత్వంలో పన్నాగం
- తారకరామానగర్ వాసుల పేరుతో స్థానికేతరులు తిష్ట
- ఇంటి స్థలాల కోసమంటూ 40 ఎకరాల్లో సరిహద్దుల ఏర్పాటు
- రెండు రోజులుగా అక్కడే తిష్ట
- చర్చలు జరిపినా గుట్టదిగని ఆక్రమణదారులు



రేణిగుంట మండలం, కరకంబాడి సమీపంలో ఆక్రమించిన గుట్ట ప్రాంతంలో స్థానికేతరులు



వామపక్షాలు, మహిళలతో చర్చిస్తున్న రెవెన్యూ, పోలీసులు అధికారులు

రేణిగుంట: పేదల ముసుగులో దౌర్జన్యకాండకు దిగారు. సుమారు వెయ్యి మంది స్థానికేతరులు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో గుట్టపైకి ఎక్కి ఆక్రమణల పర్వానికి తెరలేపారు. సుమారు రెండు రోజులుగా గుట్టపైనే తిష్టవేసి అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్న ఘటన తిరుపతి- కరకంబాడి మార్గం, కరకంబాడి గ్రామ సచివాలయానికి చేరువలో కొండగుట్ట వద్ద చోటు చేసుకుంది. గుట్టపై సర్వే నం.153లో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య కోర్టులో వాజ్యం నడుస్తోంది. ఈ వివాదాస్పద స్థలం గణతంత్ర దినోత్సవం రోజున కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ ప్రజల ముసుగులో సుమారు వెయ్యి మందిని సీపీఎం నాయకులు గుట్టపైకి చేర్చి మూకుమ్మడిగా ఆక్రమణలకు తెగబడ్డారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దురాక్రమణకు యత్నించారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అక్కడకు చేరుకుని వారితో పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే వీరి వికృత చేష్టలతో కరకంబాడివాసులు రగిలిపోతున్నారు. వీరంతా ఎవరు..? ప్రభుత్వం అర్హులను గుర్తించి ఇంటి పట్టాలు ఇచ్చింది కదా..? ఎవరైనా ఇంకా పట్టాలు రాకుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి..? ఇలాంటి దౌర్జన్యకాండ ఏమిటని మండిపడుతున్నారు.

కనిపించని స్థానికులు

ఇక్కడ గుట్టపైన ఉన్న 40 ఎకరాల్లో ఆక్రమించి చీరలతో పరదాలు కట్టుకున్న వారిలో స్థానికులెవ్వరూ కనిపించడం లేదు. తారకరామానగర్‌కు చెందిన కొందరు వామపక్షాల అనుచరులను తీసుకొచ్చి ముందుపెట్టి మదనపల్లి, పీలేరు, కడప, కోడూరు, పుత్తూరు, తిరుపతి, చంద్రగిరి ప్రాంతాలకు చెందిన స్థానికేతరులను తీసుకొచ్చి దౌర్జన్యంగా చీరల పరదాలు వేయించి భూఆక్రమణకు వామపక్ష నాయకులు వ్యూహం రచించినట్లు స్థానికులు పెదవి విరుస్తున్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సుమారు నాలుగు వేల ఇళ్లు ఉన్నప్పటికీ, వెయ్యి ఇళ్లలో మాత్రమే కాపురాలు ఉన్నారు. వారు కూడా గతంలో ఉన్న ఓ తహసీల్దార్ నుంచి వందల సంఖ్యలో అనుభవ పట్టాలను తీసుకుని స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో కొందరు టీడీపీ నాయకుల కనుసన్నల్లో తారకరామానగర్ గుట్టప్రాంతం పూర్తిగా ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారు. ఆ తర్వాత ఇంకా ఇంటిస్థలాలు లేని వారిని గుర్తించి జగనన్న ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. అయితే ఇంకా ఎవరైనా ఇంటిస్థలాలు రాని వారుంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తారకరామానగర్‌లోని పలు సమావేశాల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. అయితే దరఖాస్తు చేసుకోకపోగా, సుమారు వెయ్యి మంది మూకుమ్మడిగా కరకంబాడి సమీపంలోని విలువైన స్థలంలో ఇంటిస్థలాల కోసమని ఆక్రమించారు. ఆపై అక్కడే తిష్ట వేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. కొండ గుట్టపై గడ్డికి కొందరు నిప్పుపెట్టి అలజడి సృష్టిస్తున్నారు.



గుట్టపై చీరలతో పరదాలు

మరోసారి చర్చలు

శనివారం మరోసారి తహసీల్దార్ ఉదయ్ సంతోష్, రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి తమ సిబ్బందితో కలిసి గుట్టపైన ఉన్న వారితో చర్చలు జరిపారు. ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అయితే తమకు ఇక్కడే పట్టాలు ఇవ్వాలని, అప్పటి వరకు నిద్రాహారాలు మాని ఇక్కడే ఉంటామని వారు భీష్మించారు. దట్టమైన అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న ఈ ప్రాంతంలో కొందరు ఆకతాయిలు అలజడి సృష్టించేందుకు సిద్ధమయ్యారు. అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారులు ప్రత్యేక బలగాలను దింపే అవకాశం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

అసత్య వార్తలతో సమాజానికి ముప్పు



మాట్లాడుతున్న వైష్ణ రాయ్

తిరుపతి సిటీ: మీడియా సత్యవార్తలనే ప్రచారం చేయాలని, లేకుంటే సమాజానికి ముప్పు తప్పదని ఫ్రంట్‌లైన్ ఎడిటర్ వైష్ణ రాయ్ తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో శ్రీగొట్టిపాటి సింధు, విమల, సుబ్బారావు జ్ఞాపకార్థం శనివారం స్మారక ధర్మనిధి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఆమె మీడియా ఉన్నతిలో 'మహిళ యొక్క పాత్ర' అనే అంశంపై ప్రసంగించారు. ఆంగ్ల సాహిత్యంలోని షేక్స్‌ఫియర్ రాసిన సెవన్ స్టేజెస్ ఆఫ్ లైఫ్ అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ రెక్టార్ ఉమ, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జిగా రోహిత్



తిరుపతి లీగల్: జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో తిరుపతికి చెందిన న్యాయవాది ఎం.రోహిత్ ఎంపిక య్యారు. తిరుపతిలోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్‌లో ఆయన న్యాయ విద్యను అభ్యసించారు. 2021లో తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. దివంగత సీనియర్ న్యాయవాది రామచంద్ర రాజు వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆయన తండ్రి దేవదానంద రాష్ట్ర వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఓపెన్ క్యాటగిరిలో ఎం.రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంపై పలువురు న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు హర్షం వ్యక్తం చేశారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన రోహిత్ మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్నదే తన ఉద్దేశమన్నారు. జూనియర్ న్యాయవాదిగా ఉన్న తనకు రాష్ట్ర సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన లా నేస్తం ఎంతగానో ఉపయోగపడిందన్నారు.

మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఫిబ్రవరి 1 (గురువారం) నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్ట వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని కోరారు.

నేడు బహిరంగ సభ

చంద్రగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులపై ఆదివారం బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఏపీఓ జ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–2023 సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రారంభమవుతుందని, ప్రజలంతా తప్పక హాజరు కావాలని ఆ ప్రకటనలో తెలిపారు.

సుధీరా.. నాలుగున్నరేళ్లు ఎక్కడున్నావ్?

- తెలంగాణ నుంచి వచ్చి రాజకీయాలు చేయొద్దు
- బొజ్జల సుధీర్‌రెడ్డిపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పడిన తర్వాత అత్యధిక కాలం బొజ్జల గోపాల కృష్ణారెడ్డే ఇక్కడ పాలించారు. ఆయన అత్యధిక సమయం హైదరాబాద్‌లో ఉంటూ ఎన్నికలప్పుడు వచ్చి స్థానికులకు మాయమాటలు చెప్పి బోల్తా కొట్టించేవారు. ఆయన తర్వాత కుటుంబమంతా తెలంగాణకే పరిమితమైంది. ఇప్పుడు ఎన్నికలొచ్చేసరికి కొడుకు బొజ్జల సుధీర్‌రెడ్డి, కోడలు, అమ్మ దిగిపోయారు. ఈ నాలుగున్నరేళ్లు ఎక్కడున్నారో కూడా ఎవ్వరికీ తెలి యదు'. అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డిపై స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వద్ద శనివారం ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడు తూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడే కార్యాలయం ఏర్పాటు చేసుకుని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నా నన్నారు. నియోజకవర్గంలో రూ.154 కోట్లతో రోడ్లు నిర్మించానని, ఊరందూరుతో సహా 12 ఆలయాల్లో కుటుంభాభిషేకాలు నిర్వహించామని తెలిపారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘాన్ని గ్రేడ్–1గా గుర్తించి, రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కరోనా కష్టకాలంలో స్థానికంగా ఉంటూ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్టు పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బొజ్జల సుధీర్‌రెడ్డి తెలంగాణ నుంచి కుటుంబంతో సహా వచ్చి తనపై అపవాదులు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. త్వరలో దక్షిణ కై లాస ముక్తిధామం ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.53 కోట్లతో డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే స్కిట్ కళాశాలను త్వరలో జేఎన్‌టీయూ నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: గాజులమండ్యం దళితవాడలోని టీడీపీకి చెందిన 25 కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. రేణిగుంటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి వారికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేదలకు చేస్తున్న సహాయ, సహకారాలు చూసి, ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీలో చేరినవారిలో కృష్ణ య్య, చందిలి బాబు, వెంకటముని, పురుషోత్తం, సుధాకర్, నరేష్, శేఖర్, సుబ్రమణ్యం, మనోహర్, మల్లికార్జున్, ప్రసాద్, కుమార్, యుగంధర్, వినయ్, మురళీకృష్ణ, యోగేంద్ర, ఆదిలక్ష్మి, మునికృష్ణయ్య, మురగయ్య, కుమారి, ప్రియ, రాజేశ్వరి, సుమతి, జ్వాల, గోపీ, పద్మ, వసంతమ్మ, శైలజ, రాణి, రంగమ్మ, సుజాత, చెంగమ్మ, మునెమ్మ, కాలమ్మ, జ్యోతి, నిర్మల, ఊహ తదితరులు ఉన్నారు. రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, జువ్వల దయాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

- 17 కమిటీల్లో 436 మందికి చోటు

తిరుపతి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పలువురికి పదవులు దక్కాయి. ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో 17 కమిటీల ద్వారా 436 మందికి అవకాశం కల్పించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి జిల్లా పంచాయతీ రాజ్ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో 21 మందిని నియమించారు. అదేవిధంగా రైతు విభాగం కమిటీలో మరో 24 మందికి చోటు కల్పించారు. జిల్లా ఎస్సీ విభాగ కమిటీలో 32 మందికి, ఎస్టీ విభాగ కమిటీలో 27 మందిని ఎంపిక చేశారు. జిల్లా విద్యార్థి విభాగ కమిటీలో 24 మందికి చోటు కల్పించారు. జిల్లా వాణిజ్య విభాగ కమిటీలో 22 మందికి, జిల్లా వికలాంగుల విభాగ కమిటీలో 18 మందికి, జిల్లా చేనేత విభాగ కమిటీలో 22 మందికి, జిల్లా యువజన విభాగ కమిటీలో 33 మందికి చోటు కల్పించారు. జిల్లా సేవాదళ్ విభాగ కమిటీలో 31 మందిని ఎంపిక చేశారు. జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగ కమిటీలో 16 మందిని, జిల్లా బీసీ విభాగ కమిటీలో 32 మందికి అవకాశం కల్పించారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగ కమిటీలో 28 మందికి, జిల్లా సాంస్కృతిక విభాగ కమిటీలో 16 మందిని ఎంపిక చేశారు. జిల్లా ఐటీ విభాగ కమిటీలో 27 మందికి, జిల్లా మహిళా విభాగ కమిటీలో 32 మందిని ఎంపిక చేశారు. జిల్లా మైనారిటీ విభాగ కమిటీలో 31మందికి చోటు కల్పించారు. వీరంతా వారికి కేటాయించిన కమిటీల బలోపేతానికి కృషి చేయనున్నారు.

ఎస్వీబీసీకి రూ.10 లక్షల విరాళం

తిరుపతి(అలిపిరి): అమెరికాకు చెందిన ప్రవాస భారతీయులు చంద్రశేఖర్ ఎస్వీబీసీ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తమ ప్రతినిధి వై.రాఘవేంద్రతో కలిసి విరాళం చెక్కును తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని కార్యాలయంలో ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

30న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతీపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన ఉదయం జాబ్ మేళా నిర్వహించనునున్నట్లు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మశీలో రిటైల్ ట్రైనీ/ఫార్మాసిస్ట్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్హత కలిగి 18– 30ఏళ్లలోపు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులన్నారు. వీరికి ఆ సంస్థ ప్రతినిధులతో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు.

బంగారు తిరుచ్చిపై అభయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలిసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

'నారాయణ'లో విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థిని మృతదేహం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి డీబీఆర్ ఆస్పత్రి సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.ప్రశాంతి(17) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం ఉదయం స్థానికంగా కలకలం రేపింది. సహవిద్యార్థినులు లేని సమయంలో హాస్ట ల్ గదిలో ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం అందించి హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలం, పనపాకం సమీపంలోని అరిగిరివారిపల్లి గ్రామానికి చెందిన లేట్ ఎన్.నాగరాజు, ఆర్టీసీ కండెక్టర్ ఎస్.జయంతి దంపతుల కుమార్తె ఎస్.ప్రశాంతి తిరుపతిలోని నారాయణ కళాశాలలో ఎంపీసీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన గంగాధర్ అనే యువకుడు ప్రేమ పేరుతో ఆ విద్యార్థినిని వేధించేవాడు. విద్యార్థిని చదువుకునే కళాశాలకు వెళ్లి ప్రేమించాలని బెదిరించేవాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు గతంలో అతన్ని వారించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో వేధింపులు తట్టుకోలేక శనివారం ఉదయం సహ విద్యార్థినులు లేని సమయంలో హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. తమ కుమార్తె మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అలాగే కళాశాల సిబ్బంది చేసిన ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యింది.

దొంగతనానికి వెళ్లి వ్యక్తి మృతి


మృతి చెందిన రమేష్

దొరవారిసత్రం: విద్యుత్ ట్రాన్స్‌ఫారంలో రాగి తీగలు చోరీ చేసేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లబల్లి గ్రామ సమీపంలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు కథనం.. డక్కిలి మండలం, మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన రమేష్(32) ట్రాన్స్‌ఫార్మర్ దొంగ. ఈ క్రమంలోనే నెలబల్లి గ్రామ సమీపంలో ఉన్న 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి పనిచేయడంలేదని గుర్తించి అందులోని రాగి వైర్లను దొంగలించేందుకు పథకం వేశాడు. అనుకున్నట్టే శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగలు చోరీ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫారంలోని విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఏఈ జగదీష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, పిల్లలు ఉన్నారు. ఇతనిపై డక్కిలి, కలిగిరి, మర్రిపాడు తదితర మండలాల్లో దొంగతనం కేసులు ఉన్నట్టు సమాచారం.

రసీదుల్లేని 2.85 కిలోల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ నగదు, బంగారు ఆభరణాలను చూపిస్తున్న జీఆర్‌పీఎఫ్ పోలీసులు

గూడూరు రూరల్: రైల్లో ప్రయాణించే వారిని గూడూరులో శనివారం రాత్రి రైల్వే పోలీసులు తనిఖీ చేయగా 2.85 కిలోల బంగారం, రూ.10.3 లక్షల నగదు పట్టుబడింది. గూడూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి గూడూరులో శబరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తుండగా కోయంబత్తూరుకు చెందిన కనన్న సాయికుమార్ బ్యాగులో 2,065 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7,62,520 నగదు ఉన్నాయి. అదే ప్రాంతానికి చెందిన లోకనాథన్ బ్యాగులో 790 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 2.70లక్షల నగదు ఉంది. వాటికి సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని, వాద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భుజంగ రావుకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, గణేష్, జయప్రకాష్, సురేష్ పాల్గొన్నారని తెలిపారు.

బైక్ ర్యాలీ

తిరుపతి మంగళం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రవాణా, పోలీస్‌శాఖల నిబంధనలను పాటించాలని జిల్లా రవాణాశాఖాధికారి(డీటీవో) ఆదినారాయణ, రాష్ట్ర రవాణాశాఖ సభ్యులు ఎం.సునీల్‌చక్రవర్తి కోరారు. అఖిల భారత రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం డీటీవో ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రజల్లో, వాహనదారుల్లో చైతన్యం వస్తేనే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రాష్ట్ర రవాణాశాఖ సభ్యులు సునీల్‌చక్రవర్తి మాట్లాడుతూ రవాణాశాఖ, పోలీస్‌శాఖల నిబంధనలు పాటించడంలో వాహనదారులు, యువత నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. బిడ్డలపై ఉన్న ప్రేమతో వాహనాలు కొనుగోలు చేయించే తల్లిదండ్రులు రోడ్లపై అధిక స్పీడు పోకుండా జాగ్రతలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంవీఐలు శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, కుసుమ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.